






మీడియా సెంటర్‌లో మాట్లాడుతూ రాకెట్, ఉపగ్రహ నమూనాను చూపుతున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్, శాస్త్రవేత్తలు - రెండో దశ.. - నాలుగో దశ



ఇస్రో విజయాశ్వం

మరోసారి విజయం

● పీఎస్‌ఎల్వీ-సీ 60 రాకెట్ ప్రయోగం విజయంతో శాస్త్రవేత్తల్లో హర్షాతిరేకాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇస్రో విజయాశ్వం పీఎస్‌ఎల్వీ మరోసారి విజయకేతనం ఎగురవేసింది. విభిన్న ప్రయోగాలకు పీఎస్‌ఎల్వీ వాహక నౌక బ్రహ్మాస్త్రంలా మారింది. సోమవారం రాత్రి 10 గంటల 15 సెకన్లకు ప్రయోగించిన పీఎస్‌ఎల్వీ-సీ 60 విజయవంతమైంది. ఈ రాకెట్ ద్వారా స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను నిర్దీత కక్ష్యలోకి విజయవంతంగా విడిచిపెట్టడంతో షార్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. బుడిబుడి అడుగుల ప్రస్థానంలో ప్రారంభమైన పీఎస్‌ఎల్వీ నేడు విదేశీ ఉపగ్రహాలనూ సునాయసంగా అంతరిక్షంలోకి చేర్చేస్థాయికి చేరింది. ఇస్రోకు పీఎస్‌ఎల్వీ రామబాణంగా మారింది. ఒకేసారి 10, 20, 38, 104 ఉపగ్రహాలను విజయవంతంగా చేర్చి ప్రపంచ స్థాయిలో పేరు కూడా పీఎస్‌ఎల్వీకే దక్కింది. ఇప్పటి వరకు షార్ నుంచి 62 పీఎస్‌ఎల్వీ ప్రయోగాలు చేపట్టగా కేవలం రెండు మాత్రమే విఫలం చెందాయి. ఈ రాకెట్ ద్వారా 505 ఉపగ్రహాలను ప్రయోగించగా ఇందులో 433 విదేశీ.. 70 స్వదేశీ ఉపగ్రహాలు, పలు వర్సిటీలకు చెందిన 13 బుల్లి ఉపగ్రహాలు ఉన్నాయి.

తిరుమలలో పీఎస్‌ఎల్వీ-సీ60 నమూనాకు పూజలు

తిరుమల/సూళ్లూరుపేట, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట షార్ నుంచి ప్రయోగించనున్న పీఎస్‌ఎల్వీ-సీ60 నమూనాకు తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిప్రయోగానికి ముందు ఇస్రో శాస్త్రవేత్తలు, అధికారులు ఇలా తిరుమల రావడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఇస్రో డైరెక్టర్ దినేష్‌కుమార్ సింగ్, పిన్సిపల్ సెక్రటరీ యశోద, ఎన్‌ఎఆర్‌ఎల్ డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్ర, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌గుప్తా బృంద సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో నమునాతో ఆలయంలోకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. మరోవైపు, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని సోమవారం ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ దర్శించుకొని పూజలు చేశారు. ఆస్థాన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, షార్ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయం వద్ద ఇస్రో అధికారుల బృందం

రోడ్‌షోలు.. హామీలు.. ప్రలోభాలు.. బెదిరింపులు.. అయినా ప్రశాంతంగానే ఎన్నికలు జరిగాయి. ఆశలు, అంచనాలు తలకిందులయ్యాయి. జగన్ పార్టీకి తీవ్ర భంగపాటును 2024 మిగిల్చింది. చంద్రబాబు సారథ్యంలోని కూటమికి అనూహ్యమైన విజయాన్ని అందించింది. విర్రవీగి, నోటికి పనిచెప్పిన నేతలంతా నేలకరిచారు. అప్పులకుప్పగా మిగిలిన ఏపీలో ఒక సవాలుగా కూటమి పాలన మొదలైంది. రెండు భిన్న దృశ్యాలకు సాక్షిగా మిగిలిన 2024లో తిరుపతి జిల్లాపై ప్రభావం చూపిన ప్రధాన సందర్భాల సమాహారం ఇది..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



1 — 14 మే — పులివర్తి నానిపై దాడి



చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద జరిగిన హత్యాయత్నం రాష్ట్రంలోనే సంచలనం అయ్యింది. వైసీపీ బరితెగింపు రాజకీయాలను ఈ సంఘటన బట్టబయలు చేసింది. మే 13న పోలింగ్ జరగగా మరుసటి రోజు మహిళా వర్సిటీ ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించేందుకు వెళ్ళిన పులివర్తి నానీపై వైసీపీ వర్గీయులు సమ్మెట, కర్రలతో దాడి చేశారు. నానీ వాహనం ధ్వంసం అయ్యింది. ఆయన గాయపడ్డారు. ఈ దాడి దృశ్యాలు సీసీ కెమెరాలు, నానీ వాహనానికి అమర్చిన కెమెరాల ఫుటేజీల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ అయ్యాయి. దీనిపై ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని నానీపై దాడి ఘటన సహా పోలింగ్ రోజు జరిగిన ఘటనలపైనా దర్యాప్తునకు సిట్‌ను నియమించింది. ఈ ఘటన చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలను తారుమారు చేసింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారంటూ నానీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

2 — 4 జూన్ — దిమ్మదిరిగేలా ఫలితాలు



ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికలు జగన్ పార్టీకి దిమ్మతిరిగే తీర్పునిచ్చాయి. వైసీపీ ఎమ్మెల్యేల, వారి అనుచరుల అరాచకాలను భయంతో మౌనంగా భరించిన ప్రజలు ఓట్ల ద్వారా తమ వ్యతిరేకతను ప్రకటించారు. తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు తదితర ఆరు పూర్తి నియోజకవర్గాలు, నగరి, వెంకటగిరి తదితర రెండు పాక్షిక నియోజకవర్గాలు.. మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లోనూ వైసీపీ తుడిచిపెట్టుకుపోయింది. చావుతప్పి కన్నులొట్టపోయిన చందంగా వైసీపీ తిరుపతి ఎంపీ స్థానాన్ని మాత్రమే అదీ స్వల్ప తేడాతో నిలబెట్టుకుంది.

3 — 12 జూన్ — ముఖ్యమంత్రిగా మూడోసారి

నారావారిపల్లె బిడ్డ చంద్రబాబు నాయుడు మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అదేరోజు తిరుమలకు వచ్చిన ఆయన జూన్13న శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే అక్టోబరు4వ తేదీన మరోసారి తిరుమలకు చేరుకుని బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించారు.



7 — 4 నవంబరు — రాజకీయ అత్యాచారం

ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికపై అత్యాచారం జరిగిందంటూ అధికారం కోల్పోయిన వైసీపీ నేతలు నానా రచ్చ చేశారు. సోషల్ మీడియాలో హోరెత్తించారు. ఆసుపత్రిలో ఉన్న బాలికను పరామర్శించేందుకు



రోజా, భూమన కరుణాకరరెడ్డి, అభినయరెడ్డి, నారాయణస్వామి వచ్చి నిరసన తెలిపారు. నా బిడ్డపై దాడి మాత్రమే జరిగిందంటూ తండ్రి చేతులు జోడించి వేడుకోవాల్సి వచ్చింది. తమ కుమార్తె భవిష్యత్తును దెబ్బతీశారని మైనర్ బాలిక తండ్రి ఫిర్యాదు చేశాడంటూ పోలీసులు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు మరికొందరిపై పోక్సో, ఎస్సీ అట్రాసిటీ తదితర చట్టాల కింద కేసు నమోదు చేశారు. అయితే పోలీసులు తనతో తప్పుడు ఫిర్యాదు చేయించారని ఆ తర్వాత తండ్రి , భూమన కరుణాకర్‌రెడ్డి ఇంట్లో మీడియాతో తెలిపారు. మొత్తం మీద ఈ వ్యవహారం పేద దళిత మైనర్ బాలిక కుటుంబంపై జరిగిన రాజకీయ అత్యాచారంగా పరిణమించింది.

4 — 12 ఆగస్టు — తిరుపతిని కుదిపేసిన టీడీఆర్ బాండ్లు

తిరుపతి అసెంబ్లీ ఎన్నికను తీవ్రంగా ప్రభావితం చేసిన అంశం మాస్టర్‌ప్లాన్ రోడ్ల అవినీతి. అధికార వైసీపీ దీనిని గొప్ప అభివృద్ధి అని చెప్పుకోగా విపక్షాలు దీని వెనుక అవినీతి ఉందని ఆరోపణలు చేశాయి. కొన్ని రోడ్లకు భూమన కరుణాకరరెడ్డి చైర్మన్‌గా ఉన్న టీటీడీ పాలకమండలి నిధులు ఇవ్వాలని తీర్మానించడం పెను వివాదంగా మారింది. రోడ్ల విస్తరణ పేరుతో టీడీఆర్ బాండ్ల జారీ వెనుక వెయ్యి కోట్లకు పైగా అవినీతి జరిగిందని టీడీపీ నాయకుడు ఆనం వెంకటరమణారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై విచారణ ఆగస్టు 12న విచారణకు ఆదేశించింది.



6 — 18 సెప్టెంబరు — లడ్డూలో కల్తీ నెయ్యి



భక్తులు పవిత్రంగా భావించే లడ్డూలో కల్తీ నెయ్యి కలిపి అపవిత్రం చేశారనే అంశం దేశవ్యాప్తంగా భగ్గుమంది. ఈ అంశాన్ని తొలిసారి పార్టీ సమావేశంలో చంద్రబాబు ఆవేదనగా ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వంలో టెండరు దక్కించుకున్న దిండిగల్‌కు చెందిన ప్రైవేటు డెయిరీ టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిందని శాంపిల్ పరీక్షించిన ప్రముఖ ల్యాబ్ నిర్ధారించింది. పందికొవ్వు వంటి ఆనవాళ్లు ఆ నెయ్యిలో ఉన్నాయనే ఆరోపణలు భక్తులను తీవ్రంగా కలిచివేశాయి. ఈ నేపథ్యంలో జగన్ తిరుమల పర్యటననే రద్దు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ అంశంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించగా సుప్రీం కోర్టు ఏకంగా . సీబీఐ, ఏపీ పోలీస్, కేంద్ర ఆహార భద్రత విభాగం ఉన్నతాధికారులతో సిట్ ఏర్పాటు చేసింది.

8 — 29 నవంబరు — భయపెట్టిన ఫెంగల్

ఫెంగల్ తుపాను జిల్లాను కలవరపరిచింది. వరుసగా కురిసిన నవంబరు ఆఖరులో పట్టుకున్న వానలు డిసెంబరు తొలివారం దాకా విడవలేదు. జిల్లాలోని చెరువులు నిండిపోయాయి. ప్రాజెక్టులు గేట్లు ఎత్తేశారు. వాగులు, వంకలు పొంగి రోడ్లను అడ్డగించాయి. జిల్లా తూర్పు ప్రాంతం తీవ్రవంగా తుఫాను ప్రభావానికి గురైంది. అయితే జిల్లా సరిహద్దుల్లో తమిళనాడులో తీరం దాటు తుందనుకున్న తుపాను కరుణించి వెళ్లిపోయింది. ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో సంభవించిన నాలుగు తుపాన్లు జిల్లాకు వానలు కురిపించాయి.



9 — 18 డిసెంబరు — శ్రీసిటీలో ఇసుజి లక్షవ కారు



భారతదేశంలోనే అత్యంత విజయవంతమైన సెజ్‌గా శ్రీసిటీ రికార్డుల మీద రికార్డులు నెలకొల్పుతోంది. శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఇసుజి మోటార్స్ ఇండియా ప్లాంట్‌లో తయారైన లక్షవ కారును మేడిన్ ఇండియా పేరిట విడుదల చేశారు.

5 — 26 ఆగస్టు — కౌశిక్‌కు మానవీయ సాయం

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తిరుపతి యువకుడు కౌశిక్ (19) వార్తకు మానవీయ స్పందన లభించింది. చికిత్స కోసం రూ. 60 లక్షలు ఖర్చవుతుందంటూ తల్లి సరస్వతమ్మ మీడియా ముం కన్నీరుమున్నీరవుతూ తన కొడుకు ప్రాణం కాపావాలని వేడుకున్నారు. జూనియర్ ఎన్టీయార్ వీరాభిమాని అయిన కౌశిక్, చనిపోయే లోపు దేవర సినిమా చూడాలనుకుంటున్నాడని వెల్లడించారు. స్పందించిన జూనియర్ ఎన్టీయార్ వీడియో కాల్ చేసి కౌశిక్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. కోలుకున్నాక వచ్చి కలుస్తానని మాటిచ్చారు. కౌశిక్ తండ్రి టీటీడీలో కాంట్రాక్టు ఉద్యోగి అయినా టీటీడీ మానవీయంగా స్పందించి రూ.40 లక్షల సాయం అందించింది. చికిత్స పూర్తయ్యాక అదనంగా అయిన బిల్లు రూ. 12 లక్షలు జూనియర్ ఎన్టీయార్ చెల్లించారు. అందరి మానవీయ సాయంతో కౌశిక్ కోలుకుంటున్నాడు.


దేవర సినిమా చూసి చచ్చిపోతా
అమ్మా.. అప్పటిదాకా బతికించండి

10 — 30 డిసెంబరు — 99వ రాకెట్ ఎగిరింది



మన జిల్లాలోని శ్రీహరికోట నుంచి 99వ రాకెట్ దిగ్విజయంగా అంతరిక్షంలోకి దూసుకుపోయింది. పిఎస్ఎల్వీ-సి 60 రాకెట్ రెండు ఉపగ్రహాలను మోసుకుపోయింది. మన సొంత అంతరిక్ష కేంద్రం నెలకొల్పే దిశగా సాగిన ప్రయోగం ఇది. ఇక ఈ ఏడాది శ్రీహరికోట నుంచి ఇస్రో ఐదు రాకెట్‌లను విజయవంతంగా ప్రయోగించింది. నాలుగు పూర్తిగా దేశీయ అవసరాల కోసం చేపట్టగా ఒకటి మాత్రం యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ తరపున శాటిలైట్‌ను ప్రయోగించారు.

అగ్రికల్చర్ కాలేజీ ప్రొఫెసర్ ఉమామహేష్ సస్పెన్షన్

విద్యార్థినిపై లైంగిక వేధింపుల నేపథ్యంలో అధికారుల నిర్ణయం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీ ఫిజియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ వి. ఉమామహేష్ సస్పెండయ్యారు. విద్యార్థినిపై లైంగిక వేధింపుల నేపథ్యంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. లైంగిక వేధింపుల నేపథ్యంలో ఆయన్ను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, రిమాండు విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ఉద్యోగ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ఉమా మహేష్‌ను సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయించారు. వర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రరావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

రెవెన్యూ సదస్సులకు 677 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నిర్వహించిన 32 రెవెన్యూ సదస్సులకు 677 అర్జీలు వచ్చాయి. ఇళ్ల స్థలాలపై 376, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ 17, మీసేవ గ్రీవెన్స్(రెవెన్యూ)పై 21, క్యాస్ట్ వెరిఫికేషన్ 14, ఫాం 22ఏ 9, రీసర్వే 43, ల్యాండ్ గ్రాబింగ్ 7, ఆర్‌వోఆర్‌పై 122, ఇతర విషయాలకు సంబంధించి 83 అర్జీలు వచ్చాయి. వీటిలో 53అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇప్పటి వరకు 14,480 అర్జీలు వచ్చాయన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

మంగళం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరానికి ఒకరోజు ముందే మంగళవారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలో 2,63,995 మందికి రూ.112.59 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రకృతి సాగు పద్ధతితో ఎక్కువ ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీదేవి

రామచంద్రాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగుతో ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీదేవి అన్నారు. సోమవారం రాయలచెరువు వద్ద రాయలమండపంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సాగులో జీవం, నానో ఎరువుల వాడకంపై శిక్షణ ఇచ్చారు. సాగు పద్ధతులు, జీవ నియంత్రణ పద్ధతులు, సమగ్ర సస్య రక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. అలాగే పలు కషాయాల తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ మండల టీమ్ లీడర్ విమల, యూనిట్ ఇన్‌చార్జులు, ఐసీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ స్థలంలో ఆక్రమణల తొలగింపు



కాలువస్థలంలో ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లు

తిరుపతి రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిగురువాడ ఉత్తరపుకండ్రిగలో సర్వేనంబరు 376లోని కాలువ పోరంబోకుస్థలంలో ఆక్రమణలను ఆదివారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఇక్కడి ఆక్రమణలపై గ్రామస్తులు తహసీల్దార్ రామాంజులునాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు స్థలాన్ని సందర్శించి హద్దు రాళ్లను తొలగించామని ఆర్ఐ రఘువర్మ, వీఆర్వో రమేష్ పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో సర్వేనంబరు 376లో 2.02ఎకరాలభూమి కాలువ పోరంబోకుగా నమోదై ఉందన్నారు. రెండేళ్ల క్రితం ఇదే స్థలంలో కొందరు ఆక్రమణకు పాల్పడగా అప్పుడు కూడా తొలగించామని వివరించారు.

రిజర్వేషన్ల పరిరక్షణ సమితి కన్వీనర్‌గా ముత్యాలు



నియామకపత్రం అందుకుంటున్న ముత్యాలు

భాకరాపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల పరిరక్షణ సమితి రాయలసీమ కన్వీనర్‌గా చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలుకు చెందిన న్యాయవాది డేరంగుల ముత్యాలు నియమితులయ్యారు. అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు పోతుల నాగరాజు నియామకపత్రం అందజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

భాకరాపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సర స్వాగత సంబరాల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. భాకరాపేటలో ఆయన సోమవారంవిలేకరులతో మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన రాత్రి 10 గంటల నుంచి వాహనాల తనిఖీ చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, కేకలు కట్ చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. ప్రత్యేక ఈవెంట్ల నిర్వహణకు అనుమతులు లేవన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి



చంద్రగిరి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షుడిగా చంద్రగిరికి చెందిన రాజులగారి పురుషోత్తంరెడ్డిని ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. సోమవారం చంద్రగిరిలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఎన్నికల ఆర్వోగా వ్యవహరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యంయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, దొరస్వామి, నరేష్‌కుమార్‌నాయుడు, మునిగంగిరెడ్డి పాల్గొన్నారు.

రైతుబజారు ఎదుట వ్యాపారులను తొలగించాలని వినతి



అదనపు కమిషనర్‌తో మాట్లాడుతున్న మహిళలు

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): రైతుబజారు ఎదుట రోడ్డుపై ప్రజలను మోసం చేస్తున్న వ్యాపారులను తొలగించాలని రైతు బజారు రైతులు,మహిళా సంఘాల సభ్యులు నగర పాలక అదనపు కమిషనర్‌ను కోరారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా అధికారులకు దరఖాస్తు సమర్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు, డ్వాక్రా మహిళల కోసం ఏర్పాటు చేసిన రైతు బజారు ఎదుట వ్యాపారులు కూరగాయలను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. బుధవారం సెలవు కాడంతో కూరగాయలను అధికధరలతో విక్రయిస్తున్నారని వివరించారు. వాహనాలకు పార్కింగ్ స్థలం లేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని రైతులు తెలిపారు.

నేడు హాయ్ గ్లామరస్ రిథమ్



పోస్టర్లను ప్రదర్శిస్తున్న యోధ బృందం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన యోధ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తుమ్మలగుంట స్పోర్ట్స్‌పార్క్‌లో హాయ్ గ్లామరస్ రిథమ్-2025 కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు యోగేష్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాత్రి 7 నుంచి అర్ధరాత్రి 12.30 గంటల వరకు సాగుతుందని చెప్పారు. బిగ్‌బాస్ ఫేమ్ ఆర్జే సూర్య, సినీ నటుడు రోహన్, జబర్దస్త్ బృందం వినోదాత్మక కార్యక్రమాలతో అలరిస్తారని వివరించారు. మైదానంలో స్టాళ్లు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 10 వేలమంది పాల్గొనేలా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. రూ. 199, రూ.498, రూ.999 ప్రవేశ టికెట్లు ఉంటాయని, కరకంబాడి మార్గంలోని డిమార్ట్ ఎదురుగా ఉన్న యోధ ఎంటర్‌టైన్‌మెంట్ కార్యాలయంలోగాని, తుమ్మలగుంట గ్రౌండ్స్ వద్ద ఏర్పాటు చేసిన బాక్స్ ఆఫీసులో గాని టికెట్లు పొందవచ్చునని సూచించారు.

మహిళలకు ఉచిత శిక్షణా తరగతులు

తిరుచానూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా ప్రాంగణంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మహిళా ప్రాంగణం జిల్లా మేనేజరు పర్హాన కోరారు. ఫ్యాబ్రిక్ కట్టర్(టైలరింగ్), జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్స్ ట్రైనింగ్)పై సుమారు రెండు నెలల వ్యవధిలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18-40 మధ్య వయసున్న మహిళలు అర్హులన్నారు. రేషన్‌కార్డు, విద్యార్హత జిరాక్సులు, మూడు ఫోటోలతో కార్యాలయ పనివేళల్లో జిల్లా మేనేజరును సంప్రదించాలన్నారు.

జీపు బోల్తా:ముగ్గురికి గాయాలు

తిరుమల, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిమార్గంలో సోమవారం ఓ జీపు బోల్తాపడింది. శ్రీవారిపాదాల సందర్శనకు 8మంది జీపులో వెళ్లారు. ఈక్రమంలో మార్గంలో బోల్తాపడింది. ముగ్గురు భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తిరుమలలోని ఆశ్విని ఆస్పత్రికి తరలించారు.

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్



తిరుచానూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సోమవారం రాత్రి కేంద్ర వ్యవసాయ, గ్రామీణ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం అమ్మవారి శేషవస్త్రంతో ఆయనను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

కంటైనర్ ఢీకొని మహిళ మృతి



రూప (ఫైల్‌ఫొటో)

పూతలపట్టు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. పాకాల మండలం చెన్నుగారిపల్లికి చెందిన రాజశేఖర్ భార్య రూప(27) బంగారుపాళ్యం మండలంలోని అమరరాజా కంపెనీలో పనిచేస్తోంది. సోమవారం ఉదయం పి.కొత్తకోట బస్టాప్ వద్ద అమరరాజా బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. రూప అక్కడికక్కడే మృతిచెందింది.

పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు..

బెల్టుషాపులు, గంజాయిపై ఉక్కుపాదం

●డీఎస్పీ రవికుమార్

కేవీబీపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో బెల్టు దుకాణాలు నిర్వహించినా, గంజాయి విక్రయించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రవికుమార్ హెచ్చరించారు. సోమవారం కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఆరా తీశారు. నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిద్దికండ్రిగ, కేవీబీపురం, ఆదవరం గ్రామాల మార్గాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు సూచికబోర్డులను ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. ఇకపై గ్రామాల్లో వ్యాపారులు, ప్రజలు వారి ఇళ్లతో పాటు దుకాణాలకు కూడా సేఫ్టీ సైరన్ లాక్‌లను వాడాలని సూచించారు. సీఐ రవీంద్ర, ఎస్ఐ ఓబయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు అట్లాంటిస్ విద్యార్థులు

తిరుపతి(విద్య), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని అట్లాంటిస్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల అధినేత కేఎస్ వాసు ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పోటీల్లో రెండవ తరగతి విద్యార్థి శ్రీచరణ్‌తేజరెడ్డి, నాల్గవ తరగతి విద్యార్థిని కీర్తన ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

రిటైర్డు ప్రొఫెసర్ మునిరత్నంరెడ్డి మృతి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఆంత్రోపాలజీ రిటైర్డు ప్రొఫెసర్ ఎ.మునిరత్నంరెడ్డి మృతి చెందారు. ఆయన మృతి పట్ల వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పి.జయరామరెడ్డి సంతాపం తెలిపారు. యూనివర్సిటీకి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఎం.బలరామిరెడ్డి స్మారక సంస్థ కార్యదర్శి ప్రొఫెసర్ మునిరత్నంరెడ్డి, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ పేట శ్రీనివాసులురెడ్డి, సభ్యులు ప్రొఫెసర్ జయచంద్రరెడ్డి, డాక్టర్ చెంచుమునస్వామి, మాంగాటి గోపాలరెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

భాష్యం ప్రీమియర్ లీగ్ విజేత వెంకటగిరి శాఖ



తిరుపతి(క్రీడలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కేవీఎస్ మైదానంలో జరిగిన భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో వెంకటగిరి శాఖ విజేతగా నిలిచింది. పుంగనూరు శాఖ రన్నరప్ నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ తమీమ్ అహ్మద్ విజేత జట్టుకు ట్రోఫీ, బహుమతి ప్రదానం చేశారు. గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా స్వీకరించాలని అన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్, భాష్యం ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ముక్కు మూసుకుని చదువుకునేదెలా!

మురుగునీటితో విద్యార్థుల అవస్థలు



బాలికల విద్యా సంస్థల వెనుక భాగంలో మురుగు నీటితో నిండిన నూకలగుంట

చంద్రగిరి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): భరించలేని దుర్వాసనతో చదువులెలా సాగించాలని విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. చంద్రగిరిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల, బాలికల సంక్షేమ వసతి గృహం ఒకే ఆవరణలో ఉన్నాయి. పక్కనే ప్రభుత్వ బాలుర ఎస్సీ సంక్షేమ వసతి గృహం కూడా ఉంది. బాలికల జూనియర్ కళాశాల వెనుకభాగంలో సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో నూకలకుంట ఉంది. సమీప అటవీ ప్రాంతం నుంచి వరద నీరు నూకలకుంటలో చేరుతుంది. కుంట నిండితే గతంలో కొత్తపేట మీదుగా స్వర్ణముఖి నదిలోకి నీరు చేరేది. దీంతో చంద్రగిరి పరిసరాల్లో 50 ఎకరాలకు పైగా ఆయకట్టుకు ప్రయోజనం చేకూరేది. పట్టణంలో తాగునీటి సమస్య తీరేది. అయితే కుంట కాలక్రమేణా ఆక్రమణలకు గురైంది. ప్రస్తుతం 3.50 ఎకరాలకు పరిమితమైంది. కొందరు ఆక్రమణదారులు కట్టపై ఇళ్లు నిర్మించేశారు. ఫలితంగా కుంట నుంచి నీరు పారేందుకు వీలు లేకుండా పోయింది. పట్టణంలోని ప్రధాన మురుగు కాలువ నీటిని ఈ కుంటకు మళ్లించారు. ఏళ్ల తరబడి మురుగు నీరు ఇక్కడి భూగర్భంలో ఇంకిపోయింది. మురుగు నీటి వలన దుర్వాసన వెదజల్లుతోంది. పక్కనే ఉన్న స్కూళ్లలో విద్యార్థులు ఈ దుర్గంధవాతావరణంలో ఇబ్బందులు పడుతున్నారు. దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. విద్యార్థునులతో పాటు పరిసర ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి నూకలగుంటలోని మురుగు నీటిని తొలగించాలని కోరుతున్నారు. గతంలో అనేకమంది అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మురుగునీరు నూకలగుంటకు మళ్లింపు

వచ్చేవారంలో శెట్టిపల్లి భూ బాధితులకు ప్రొసీడింగ్స్

●ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్ వెంకటేశ్వర్



వినతి పత్రం అందజేస్తున్న భూ సంరక్షణ కమిటీ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి భూ బాధితులకు వచ్చేవారంలో ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శెట్టిపల్లెని ఐటీ హబ్‌గా తయారుచేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉందన్నారు. సోమవారం శెట్టిపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఎమ్మెల్యే, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, తాహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి ప్రజలు గ్రామంలో మౌలిక వసతులు సమకూర్చాలని కోరారు. పుష్కరకాలం పైగా భూముల సమస్య నానుతోందన్నారు. అనంతరం ఎమ్మెల్యేకలెక్టర్‌లు మాట్లాడుతూ నూతన సంవత్సరం కానుకగా శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. నగరపాలక సంస్థ పరిధి నుంచి తుడాకు మార్చేందుకు త్వరలో జీవో విడుదలవుతుందన్నారు. ఇప్పటికే ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నవారికి ఒకటిన్నర సెంటు స్థలం కచ్చితంగా కేటాయిస్తామన్నారు. మల్టిపుల్ రిజిష్ట్రేషన్లపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుడాకు కేటాయించే భూమిని ప్లాట్స్‌వేసి విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయంతో శెట్టిపల్లిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని కమిషనర్ మౌర్య తెలిపారు. గ్రామ ఇళ్లస్థలాల సాధనకమిటీ అధ్యక్షులు రాధాకృష్ణ, నాదముని, శీను, కృష్ణలు భూ సమస్యలపై అర్జీ అందజేశారు.

గోవిందమాల భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించాలి



మాట్లాడుతున్న గోవింద మాలధారణ భక్తులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గోవిందమాల ధారణ భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించాలని పలు గోవిందమాల సేవా సమితులు, భక్త సమాజాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో అనంత గోవిందాసట్రస్ట్ గౌరవాధ్యక్షుడు శ్రీధర్, ప్రబోధానంద మాట్లాడుతూ తిరుపతిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసి వైకుంఠ ద్వార దర్శన టికెట్లను జారీ చేయాలని కోరారు. 1984 నుంచి తిరుపతి నగరంలోని గోవింద మాలాధారణ భక్తులు దీక్షను విరమించి శ్రీవారి దర్శనం చేసుకునే వారమన్నారు. టీటీడీ తీసుకున్న నిర్ణయాలవల్ల దర్శనం కష్టతరమవుతోందన్నారు. శ్రీవారి దర్శన టోకెన్ల జారీకి ఒక కేంద్రాన్ని కేటాయించాన్నారు. సమావేశంలో పలువురు గోవిందమాలధారణ దీక్ష భక్తులు పాల్గొన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష నాయకుల నిరసన

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను రాష్ట్రపతి జోక్యం చేసుకొని పదవి నుంచి తప్పించాలని నాయకులు వి.నాగరాజు(సీపీఎం),రామానాయుడు (సీపీఐ), హరికృష్ణ(సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ)డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్‌షా విషయంలో ప్రధానమంత్రి మోదీ అనుసరించిన వైఖరి సరికాదన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే తిరుమల కొండపై అన్నమయ్య భవన్‌ను తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.వేణుగోపాల్, జె.విశ్వనాథ్, వెంకటరత్నం, వెంకటేష్, టి.సుబ్రమణ్యం, సాయిలక్ష్మీ,పి.హేమలత, బుజ్జి, జయంతి,రమేష్, .రాధాకృష్ణకె.వై.రాజా, చంద్రశేఖర్‌రెడ్డి, శివ, బాషా, నదియా పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి పకడ్బందీగా ట్రాఫిక్ ఏర్పాట్లు



మాట్లాడుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి

తిరుమల, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి సీవీఎస్వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమీక్ష నిర్వహించారు. టీటీడీ అధికారులు, పోలీసులకు అదనపు ఈవో దిశానిర్దేశం చేశారు. ఏకాదశి, ద్వాదశి రోజుల్లో పోలీసులు సమన్వయంతో ఏర్పాటు చేయాలన్నారు. దర్శన టికెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనాలు ఉంటాయని విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. నిర్దేశిత తేదీ, సమయం ప్రకారం మాత్రమే అనుమతిస్తామన్నారు. పార్కింగ్ స్లాట్లను వికేంద్రీకరించాలని, దాదాపు 13 వేల వాహనాల కోసం కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సీఈ సత్యనారాయణ, టీటీడీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ర్యాలీ



తిరుపతి(విద్య), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను తక్షణం విడుదల చేయాలని యువజన, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ మేరకు సోమవారం అన్నమయ్య కూడలి వద్ద మానవహారం చేపట్టాయి. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు సంబంధించి రూ.3,580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యా సంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ చిన్నం ప్రీతి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, మోహన్ రెడ్డి, ఆశ, ఉదయ కుమార్, ప్రవీణ్ కుమార్, సుందర్ రాజు, ఓబీసీ నాయకులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంక్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జయచంద్రారెడ్డి, వైస్‌చైర్మన్,ఎండీ,డైరెక్టర్లు

తిరుపతి(జీవకోన), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ క్యాలెండర్‌ను సోమవారం బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వైస్ చైర్మన్ వాసుదేవ యాదవ్, ఎండీ శివకుమార్‌రెడ్డి, నాగిరెడ్డి, డైరెక్టర్లు నాదమునిరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, నాగిరెడ్డి, వెంకటేష్ రాయల్, బ్రహ్మానందంరెడ్డి, అమరనాథరెడ్డి, కాసిం, చంద్రయ్య, చింతా రమేష్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ క్యాలెండర్..

తిరుపతి(విద్య), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) డైరీ, క్యాలెండర్లను కడప ఆర్జేడీ కె. శామ్యూల్, డీఈఓ కేవీఎస్ కుమార్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిర్మల, జిల్లా గౌరవాధ్యక్షుడు దండు రామచంద్రయ్య, జిల్లా సహాధ్యక్షుడు సుధీర్, నాయకులు మస్తానయ్య, హరిబాబు, విజయ్‌కుమార్, శేఖర్, పద్మజ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఆసరాతో మహిళలు ఎదగాలి



మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

రామచంద్రాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మిట్టూరు కమ్యూనిటీ హాల్‌లో సోమవారం మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు విరివిగా రుణాలను మంజూరు చేస్తోందన్నారు. దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిర, ఏపీఎం గురుమూర్తి, టీడీపీమండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు జనార్ధన చౌదరి, సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

వేదవర్సిటీలో క్రీడాపోటీలు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫిట్ ఇండియా వీక్ ఫెస్టివల్‌లో భాగంగా స్థానిక వేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయంలో వారం రోజుల పాటు వేద విద్యార్థులకు క్రీడా పోటీలు కోలాహలంగా జరిగాయి. యోగా, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్‌లతో పాటు ఇండోర్ క్రీడలు జరిగాయి. సోమవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వీసీ రాణీసదాశివమూర్తి,రిజిస్ట్రార్ ఆచార్య రాధాగోవిందం, డాక్టర్ భారతశేఖరాచార్యులు, డాక్టర్ పి.నీలకంఠం, ఎస్.ఎస్. మూర్తి, మోహిత్‌చంద్రపరాగి పాల్గొన్నారు.

సాహిత్య సంస్కృతి డీన్‌గా సత్యనారాయణాచార్య



నియామక ఉత్తర్వులు స్వీకరిస్తున్న సత్యనారాయణాచార్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని సాహిత్య సంస్కృతి డీన్‌గా ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.4కోట్లతో సీసీరోడ్ల నిర్మాణ పనులు

తిరుపతి రూరల్, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో దాదాపు రూ.4కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్ల నిర్మాణపనులను చేపట్టనున్నామని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తినానీ చొరవతో మండలానికి మొదటిదశలో రూ.4కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 24సచివాలయాల పరిధిలో 45పనులను నిర్వహిస్తామరు. వేజ్‌కాంపోనెంట్ 2-3శాతం పోను మిగతా మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో ఈవారంలో పనులను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రెండోదశలో రూ.2కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

●ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ క్యూఎండ్ క్యూసీ సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం మండలాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ శంకరయ్య పాల్గొన్నారు.

తిరుపతి

'కొత్త' వేడుకలకు అనుమతి తప్పనిసరి


డీఎస్పీ వెంకటనారాయణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో ఈవెంట్ల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఎస్పీ వెంకటనారాయణ హెచ్చరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మత్తు పానీయాలు, పదార్థాల జోలికి వెళ్లినా, అశ్లీల నృత్యాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీజేలు, బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు, కేక్‌లు కట్ చేయడం, టపాకాయలు పేల్చడం వంటివి చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.10వేలు జరిమానాతో పాటు జైలుకు పంపుతామని తెలిపారు. గరుడ వారధి, తిరుపతి-చంద్రగిరి రోడ్డు, ఎస్వీయూ వద్ద ఉన్న ఫ్లైఓవర్ల పైకి 31న రాత్రి 10 నుంచి ఒకటో తేదీ ఉదయం 4 గంటల వరకు వాహనాలకు అనుమతులు లేవన్నారు. కరకంబాడి రోడ్డు, ఆటోనగర్, తిమ్మినాయుడు పాలెం మీదుగా, హీరో హోండా షోరూం నుంచి ఆటోనగర్ వరకు, కులశేఖర్ ఆళ్వార్ 100 అడుగుల రోడ్డులో, ఎమ్మార్‌పల్లి సర్కిల్ నుంచి పద్మావతి మహిళా వర్సిటీ రోడ్డు అంటే సీతమ్మ మార్గంలో వాహనాల రాకపోకలకు అనుమతులు లేవన్నారు. ప్రజలకు ఎలాంటి సహాయం అవసరమైనా 9491086021, 9440796748, 9440796750, 9491074524లకు సంప్రదించాలని తెలిపారు.

సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు

తిరుపతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ కార్యదర్శులు, నగరపాలక సంస్థ అధికారులు సమయపాలన పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయాల కార్యదర్శుల హాజరు నమోదును పరిశీలించి, అందుబాటులో లేని వారిపై చర్యలకు ఆదేశించారు. అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు.

ఇస్కఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా పురుషోత్తం


కోట పురుషోత్తం - రామచంద్రయ్య - శ్రీధర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) జిల్లా గౌరవాధ్యక్షుడిగా కోట పురుషోత్తం నియమితులయ్యారు. ఇస్కఫ్ తిరుపతి జిల్లా ద్వితీయ మహాసభలు ఈనెల 29, 30 తేదీల్లో తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహించారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కోట పురుషోత్తం, అధ్యక్ష, కార్యదర్శులుగా రామచంద్రయ్య, శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. న్యాయ సలహాదారుగా గుర్రప్పనాయుడు, సహాయకార్యదర్శులుగా కాళయ్య, లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా గోవిందస్వామి, గిరిధర్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా చెంగల్రాయుడు, బాలరంగయ్య, వెంకటయ్య, 19 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, మత సామరస్యం, లౌకిక భావాల వ్యాప్తి కోసం కృషి చేయనున్నట్లు పురుషోత్తం పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు.

మానవాళి అభ్యున్నతిని ఆకాంక్షించేది ఆగమ శాస్త్రమే

- ఆచార్య విజయరాఘవాచార్యులు


కార్యక్రమంలో ఆచార్య విజయరాఘవాచార్యులు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్వ ప్రాణులకు ఆనందం కలగాలని ఆకాంక్షించేది ఆగమ శాస్త్రమేనని ఆచార్య తట్టా విజయరాఘవాచార్యులు పేర్కొన్నారు. వారం రోజులుగా తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో చేపట్టిన పాంచరాత్రాగమ జాతీయ వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన విజయరాఘవాచార్యులు మాట్లాడుతూ ఆగమాలలో ఉపదేశించిన ఉత్సవం సర్వజన హితమైందన్నారు. అనేక విషయాలతో కూడిన ఆగమ శాస్త్రంలో ప్రధానమైంది ఉత్సవమేనని చెప్పారు. జాతి, మత విచక్షణ లేకుండా సర్వజనాభివృద్ధిని కోరుతూ ఆలయాల్లో ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆగమాలు పరమాత్మ సాక్షాత్కారానికి మార్గాలని అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షత వహించిన ఆచార్య రజనీకాంత్ శుక్లా మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ ద్వారా ఆగమ శాస్త్రానికి సంబంధించిన అనేక విషయాలు అనేక మందికి స్పష్టమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పీటీజీ భరతశేఖరాచార్యులు, ఆచార్య వేదాంతం విష్ణుభట్టాచార్యులు, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పీటీజీ రంగరామానుజాచార్యులు, పతారం ప్రతాప్, అనంతాచార్యులు, అర్చకం శ్రీనివాసాచార్యులు, సుదర్శన్, నారాయణన్, ఈయుణ్ణి నరసింహం తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదు'

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జీవో 77 ప్రవేశపెట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకుండా ప్రస్తుత ప్రభుత్వంపై నిందలు మోపడం సరికాదని టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్‌రాయల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, జీవో 77 తదితర విద్యారంగ సమస్యలకు కారణమైన వైసీపీ, అనుబంధ విద్యార్థి విభాగంతో కలిసి వామపక్షాల నేతలు ఆందోళనలు చేయడం దారుణమన్నారు.

స్విమ్స్‌లో కార్డియాలజీ పే క్లినిక్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో గుండె సంబంధిత వ్యాధులతో పెరుగుతున్న రోగులను దృష్టిలో పెట్టుకుని కార్డియాలజీ విభాగం వారు సాయంత్రం రెండవ పే క్లినిక్‌ను జనవరి ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీపద్మావతి ఓపీడీ బ్లాక్‌లో రూమ్ 17లో కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ వనజాక్షమ్మ ఆధ్వర్యంలో పే క్లినిక్‌ను నిర్వహిస్తారని పేర్కొన్నారు.

మలబార్ మైన్ డైమండ్ ఫెస్టివల్

తిరుపతి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో సోమవారం మైన్ డైమండ్ ఫెస్టివల్‌ను ప్రారంభించినట్లు షోరూం హెడ్ రిజీష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో భాగంగా పాత మైన్ డైమండ్ ఆభరణాల మార్పిడిపై వినియోగదారులు వందశాతం విలువ పొందవచ్చునని పేర్కొన్నారు. కొత్తగా కొనుగోలు చేసే డైమండ్ విలువపై 25 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. సాలిటైర్, పార్టీవేర్, క్యాజువల్, బ్రైడల్ ఆభరణాలు, నెక్‌పీసులు, చెవిపోగులు, స్టడ్స్, రింగ్స్ వంటి ఆభరణాలతోపాటు విభిన్నశ్రేణి నగలు ఈ మైన్ డైమండ్ ఫెస్టివల్లో అందుబాటులో ఉంచామని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎస్‌గా విజయానంద్ నియామకంపై హర్షం

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన విజయానంద్ నియామకం పట్ల ఏపీ నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం చంద్రబాబు, మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తి.. మార్కెటింగ్‌పై అవగాహన

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల ఉత్పత్తి, మార్కెటింగ్‌పై విన్స్ సంస్థ ప్రతినిధులు సోమవారం చిన్నగొట్టిగల్లులో మహిళా రైతులకు అవగాహన కల్పించారు. పండించిన పంటలను వారే మార్కెట్లో అమ్ముకోవడం, బ్యాంకుల రుణాల గురించి వివరించారు. పంటలకు రసాయన ఎరువుల వాడకం వల్ల ప్రజల ఆరోగ్యంపై చూపే ప్రభావం గురించి చెప్పారు. రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు మండలాల్లోని మహిళా రైతులు కార్యక్రమానికి హాజరయ్యారు.

బస్సు కిందపడి ఒడిశా వాసి మృతి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు నుంచి తిరుపతికి వస్తున్న తమిళనాడుకు చెందిన ఆర్టీసీ బస్సు కిందపడి ఒడిశాకు చెందిన యువకుడు మృతి చెందాడు. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు ఒడిశాకు చెందిన హరీష్, పెదనాన్న కుమారుడు హరికృష్ణ రేణిగుంటకు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరుపతికి వస్తున్నారు. కాటన్‌మిల్లు రైల్వే గేటు సమీపంలో బస్సు వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. హరీష్(18) అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న హరికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. హరీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. హరికృష్ణ రుయాలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ నాగార్జున కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. తమిళనాడు ఆర్టీసీ బస్సును సీజ్ చేసినట్లు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 38 మందికి జరిమానా


తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన 38 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. జడ్జి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున 38మందికి రూ.3.80లక్షల అపరాధ రుసుం విధించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని తుమ్మలగుంట బైపాస్ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు....బైరాగిపట్టెడలోని సురేష్‌బాబు షాపులో పనిచేస్తున్న ఈశ్వర్, రెడ్డితేజ ఆదివారం రాత్రి దుకాణం మూసుకుని బైక్‌లో ఇంటికి వెళుతున్నారు. తుమ్మలగుంట బైపాస్‌లో రోడ్డు పక్కగా ఆపి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టారు. వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సీఐ చిన్నగోవిందు ఘటనా స్థలాన్ని పరిశీలించి గాయపడిన వారిని తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.







నూతన శోభ

నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని నగరంలో రకరకాల బొకేలు, కేకులు కనువిందు చేస్తున్నాయి. వివిధ ఆకృతుల్లో కేకులు ఆకట్టుకుంటున్నాయి. నాయకుల బొమ్మలతో కూడిన బొకేలు సిద్ధమయ్యాయి.

డోర్ నంబర్ల సమస్యను పరిష్కరించండి


కమిషనర్ మౌర్యకు వినతిపత్రం అందజేస్తున్న కూటమి నేతలు

తిరుపతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఒక ఇంటికి రెండు, మూడు నంబర్లు ఉండడం వలన వైసీపీ ప్రభుత్వం దొంగ ఓట్లు చేర్చేందుకు అవకాశంగా మారిందని, ఒక ఇంటికి ఒక డోర్ నెంబరు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు ఆముదాల తులసీరాం, శేషాద్రి రాయల్‌లు మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్యను కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 30 మంది వివిధ సమస్యలపై వినతులు అందించారు. లీలామహల్ కూడలిలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం చుట్టూ సుందరీకరణ చేయాలని, మహిళా మార్ట్ లిఫ్ట్‌ను మరమ్మతులు చేయించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. కే.కే.లేఅవుట్‌లో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, చింతల చేను రాములవారి ఆలయం వద్ద యూడీఎస్ లైన్ సరిచేయాలని, ఎస్టీవీ నగర్‌లో బోరు మరమ్మతులు చేయించాలని, టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ పెట్టడంతో పిల్లలు ఆడుకునేందుకు ఇబ్బందిగా ఉందని తదితర సమస్యలపై వినతులు వచ్చాయి. సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, మేనేజర్ హసీమ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో విరిగిన పగడ చెట్టు కొమ్మలు

భక్తులు లేకపోవడంతో తప్పిన ముప్పు



విరిగిపడిన పగడచెట్టు కొమ్మలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం 300 ఏళ్ల నాటి పగడ చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. ఆ సమయానికి భక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రాయలవారి మండపం పక్కనే పగడ చెట్టు ఉంది. ప్రస్తుతం రాయలవారి మండపంలో రూ.500 రాహుకేతు పూజలను జరిపిస్తుంటారు. అటు రాహుకేతు పూజలకు వచ్చే భక్తులతో పాటు పక్కనే ఉన్న ఉచిత ప్రసాదాలను స్వీకరించిన భక్తులు కూడా పగడచెట్టు కిందకు చేరుతుంటారు. ఈ క్రమంలో సోమవారం చెట్టు నుంచి రెండు భారీ కొమ్మలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఆ సమయంలో భక్తులు లేకపోవడంతో ముప్పు తప్పింది. ఇటీవల వర్షాలకు కొమ్మలునాని బరువు ఎక్కడం, చెట్టు వేరు వ్యవస్థకు నీరు చేరకపోవడం వల్ల కొమ్మలు బలహీన పడినట్లు అధికారులు భావిస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,738మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,615మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,856మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,265, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 414మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 383మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 153మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25,745 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

'కొండ'ంత ప్రక్షాళనకు అడుగులు

తిరుమలలో గాడిన పడుతున్న పాలన ● వైసీపీ పాలనలో అక్రమాలు.. కూటమి నేతృత్వంలో సంస్కరణలు

గతిస్తున్న ఈ ఏడాదిలో టీటీడీ మున్నెన్నడూ లేనివిధంగా జనం నోళ్లలో నానింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకాలు ఐదేళ్లు కొనసాగినా కూటమి ప్రభుత్వ ఏర్పడ్డాక బహిర్గతమై చర్చనీయాంశమయ్యాయి. దీంతో జాతీయ స్థాయిలో సైతం ముక్కున వేలేసుకునే పరిస్థితి ఏర్పడింది. దర్శనాలు మొదలుకుని లడ్డూ తయారీ వరకూ ఏమేరకు గాడితప్పాయో తేటతెల్లమైంది. జూన్ నుంచి సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఆలయంలో ప్రక్షాళన ప్రారంభమైంది. కొత్త బోర్డు సారథ్యంలో కొద్ది కాలంగా నెమ్మదిగా పాలన దారిన పడుతోంది. 2024 నిష్క్రమిస్తున్న వేళ వీటిలో ముఖ్యాంశాలను ఒకసారి అవలోకనం చేసుకుందాం...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గత పాలకవర్గంలో మరకలు

● ఎన్నికల సమయంలో కావడంతో ఈ ఏడాది తొలి నుంచీ వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లు కేటాయించారు. జిల్లా మంత్రులకైతే రోజుకు 30 నుంచి 40 దర్శనాలు కూడా కేటాయించేవారు. లేఖపై ఆరుగురికే దర్శనం ఇవ్వాలనే నిబంధనను పదికి పెంచేశారు. బోర్డు చైర్మన్ నుంచి సభ్యుల వరకు అడ్డుఅదుపులేకుండా పోయింది.

● ముస్లింలకు శ్రీవారిసేవ అవకాశం కల్పిస్తామని, ఇతర మతస్తులపై హిందూమతంలోని పవిత్రజలాన్ని చల్లి ఆహ్వానిస్తామని ఫిబ్రవరిలో గత చైర్మన్ భూమన కరుణకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి చేసిన ప్రకటనలు తీవ్ర దుమారం లేపాయి. భక్తుల్లో ఆందోళన కలిగించాయి.

● నిబంధనలకు విరుద్ధంగా శారదామఠం తిరుమలలో చేపట్టిన నిర్మాణాలు నాటి ప్రభుత్వ తీరుకు దర్పణం పట్టింది.

● టీటీడీ, అధికారులు, బోర్డు, సీఎం, అహోబిలం మఠం, జీయర్‌స్వాములు, అర్చకులపై ఆరోపణలు చేస్తున్నట్టుగా ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై గత బోర్డు రమణదీక్షితులను టీటీడీ నుంచి తొలగించింది. కేసు కూడా నమోదు చేసింది.

● పరకామణిలో దొంగతనం కేసు తీవ్రస్థాయిలో దుమారం రేపింది. దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయకుండా గత టీటీడీ, పోలీసులు రాజీ కుదుర్చుకోవడంపై మొదలైన విమర్శలు నేటికీ కొనసాగుతున్నాయి.

కూటమి పాలనలో సంస్కరణలకు శ్రీకారం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టీటీడీ ఈవోగా శ్యామలరావును నియమించింది. స్వామిక్షేత్రానికి పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యతలను అప్పగించింది. జూన్ 16న బాధ్యతలు తీసుకున్న ఆయన తొలిప్రాధాన్యతగా లడ్డూలు, అన్నప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టారు. లడ్డూకు వాడే నెయ్యిలో నాణ్యత లేదని గుర్తించారు. కొన్ని సరఫరా సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. నందిని వంటి సంస్థల ద్వారా నాణ్యమైన నెయ్యి దిగుమతికి చర్యలు తీసుకుని భక్తుల ప్రశంసలకు పాత్రులయ్యారు.

● ఇక, అవసరం లేకపోయినప్పటికీ నిర్మాణాల పేరుతో కోట్లాది రూపాయలు రోడ్లు, భవనాలు, ఆస్పత్రుల పేరుతో మళ్లించడం కూడా టీటీడీ వార్తల్లో నిలిచింది. రాజకీయ లబ్ధికోసమే టీటీడీ నిధులతో తిరుపతిలో రోడ్లు వేశారనే విమర్శలు వైసీపీని వెంటాడాయి.

మారిన అన్నప్రసాదాల రుచి

అన్నప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టారు. బియ్యం, కూరగాయలు, ముడిసరులకు ల విషయంలో శ్రద్ధ తీసుకున్నారు. దీంతో అన్నప్రసాదాల నాణ్యత మెరుగుపడింది. వైసీపీ ప్రభుత్వానికి ముందున్న పద్ధతుల్లోనే రుచికరంగా నైవేద్య అన్నప్రసాదాలను నివేదిస్తున్నారు.దిట్టం పెంచారు. భక్తులకూ స్వామి ప్రసాదాలు అందేలా చర్యలు తీసుకున్నారు.

శీఘ్ర దర్శనానికి అడుగులు

● తిరుమలక్షేత్రాన్ని గత వైసీపీ నాయకులు రాజకీయ ప్రసంగాలకు వేదికగా మార్చుకున్న తీరుపై నవంబరు 6న బీఆర్ నాయుడు ఆధ్వర్యంలోని బోర్డు తొలి సమావేశంలోనే బ్రేక్ పెట్టారు. రాజకీయాలు మాట్లాడితే కేసులు పెట్టేలా తీర్మానించారు.

● నిబంధనలు అతిక్రమించిన శారదమఠం లీజునూ రద్దు చేశారు.

● ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)టెక్నాలజీ ద్వారా గంట నుంచి రెండు గంటల్లోనే దర్శనమయ్యేలా కృషి మొదలుపెట్టారు.



● అన్యమత ఉద్యోగులను తిరుమల నుంచి పంపేలా ప్రణాళికలు రూపొందించారు.

● స్వామి సొమ్ముకు భద్రతను కల్పించేలా ప్రభుత్వ బ్యాంకుల్లోనే డిపాజిట్లు చేయాలని నిర్ణయించారు.

● గత ప్రభుత్వంలో రూ.కోట్లు కొల్లకొట్టేందుకు దారి చూపిన టూరిజం దర్శన టికెట్ల కోటాను రద్దు చేశారు.

● గత ప్రభుత్వం నిలిపివేసిన స్థానికుల దర్శన విధానాన్ని పునరుద్ధరించి తిరుపతి వాసుల మనసు గెల్చుకున్నారు. ● అర్హులకే బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారు. నాలుగైదు కిలోమీటర్లు ఉండే సర్వదర్శన క్యూలైన్లు ప్రస్తుతం కనిపించడం లేదు.

● స్వర్ణాంధ్ర విజన్-2047 తరహాలో 'తిరుమలవిజన్-2047'కి శ్రీకారం చుట్టి తిరుమల అభివృద్ధికి కసరత్తు చేస్తున్నారు.

● గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై స్టేట్ విజిలెన్స్ ఫోకస్ పెట్టింది.

'ఏపీకే ఫైల్' ఓపెన్ చేయొద్దు: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'సైబర్ నేరగాళ్లు ఏపీకే ఫైల్‌తో న్యూ ఇయర్ విషెస్ పదాన్ని వాడుకుని ట్రేడింగ్ చేసి డబ్బులు కాజేయడానికి సిద్ధమవుతన్నారు. అలా వచ్చిన ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేయకండి. ఒకవేళ ఓపెన్ చేస్తే మీ ఫోన్ కంట్రోల్ అంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. మీ మొబైల్ యాప్స్, మొబైల్‌లో జరిగే ప్రతి కదలికలను గుర్తిస్తారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఫొటోలు, వీడియోలు, కాంటాక్టు నెంబర్లు, ఇతర ఫైల్స్ తీసుకుంటారు. మీకు తెలియకుండానే డబ్బులు కాజేస్తారు' అని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. నూతన సంవత్సర సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొబైల్‌లో ఉన్న ఏపీకే వంటి స్కామ్ ఫైల్స్‌ను తక్షణమే తొలగించాలని సూచించారు. ఎక్కడైనా సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ క్రైం బారిన పడినవారు తిరుపతి పోలీసు మైదానంలోని సైబర్ క్రైం ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు.

గంజాయి స్వాధీనం

● ఇద్దరు ఒడిశా యువకుల అరెస్టు

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు ఒడిశా యువకులను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు. ప్రభుత్వాస్పత్రి రోడ్డులో ఇద్దరు యువకులు గంజాయితో సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. గంజాయి సహా ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒడిశాకు చెందిన బిజయ్(29), సుక్కు(25)గా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. దీనికి సంబంధించి భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపిన ప్రకారం.. పీలేరు మండలం రేగల్లుకు చెందిన లింగం అశోక్, పీలేరుకు చెందిన క్రాంతికుమార్ 2016లో ఆటోలో నాలుగు ఎర్రచందనం దుంగలను అక్రమంగా తీసుకెళుతున్నారు. ఈ విషయం తెలిసి భాకరాపేట పోలీసులు ఆటోను తనిఖీ చేశారు. నాలుగు దుంగలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపండి

● అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం
● కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌కు 284 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలకు సంబంధించి వచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు 284 అర్జీలు అందగా అందులో భూసమస్యలపై 148, పంచాయతీరాజ్‌కు 90 ఉన్నాయి. సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు.

ముంతాజ్ హోటల్ నిర్మాణం ఆపాలంటూ ధర్నా



శ్రీవారి పాదాల చెంత చేపట్టిన ముంతాజ్ హోటల్ నిర్మాణాలను నిలుపుదల చేయాలని పలు హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మద్యం, మాంసం, స్పా, స్విమ్మింగ్ పూల్ వంటి వాటితో వెలుస్తున్న ముంతాజ్‌హోటల్ నిర్మాణం పూర్తయితే హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని తిరుక్షేత్రాల రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మా ఓంకార్ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట హిందు సంఘాల నాయకులు కిరణ్, సుధాకర్‌చౌదరి, రమాదేవి, నీలకంఠ, మధు, బాబు, రాజేంద్రప్రసాద్, వెంకటేష్ ధర్నా చేపట్టారు. బీజేపీ నేతలు కూడా ఆందోళన చేపట్టారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు.

కాలనీకి రోడ్డు వేయండి

తిరుపతి నగర పరిధిలోని ఒకటో డివిజన్ అన్నమయ్య మార్గం పక్కనే ఉన్న మస్తాన్‌నాయుడు కాలనీ(కొత్తపల్లి)కి రోడ్డు వేయాలని కాలనీ వాసులు కలెక్టర్‌ను కోరారు. గుంతలమయంగా ఉన్న మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్ల మధ్యే మురుగునీరు ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, తమ ఇళ్లను అన్యాయంగా కూల్చివేశారని, న్యాయం చేయాలని రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లె వాసులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు.

దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్



శ్రీకాళహస్తి మండలం ఎంపేడుకు చెందిన దివ్యాంగుడు ఈశ్వరయ్యకు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి వినోద్ కలిసి సోమవారం ట్రైసైకిల్ అందజేశారు. తాను టేబుల్ ఫ్లవర్స్ వ్యాపారం చేస్తున్నానని, రెండు కాళ్లు లేవని, ట్రైసైకిల్ అందజేస్తే వ్యాపారానికి ఉపయోగపడుతుందని గత పీజీఆర్‌ఎస్‌లో చేసిన అభ్యర్థనపై స్పందించిన కలెక్టర్ స్పందించి, అందజేశారు.

కులగణనలో న్యాయం చేయండి



షెడ్యూల్ కుల గణనలో ఎస్సీ మాదిగకు బదులుగా ఎస్సీ ఆది ఆంధ్ర, ఎస్సీ ద్రావిడ నమోదు కావడాన్ని సరిదిద్ది ఎస్సీ మాదిగలుగా పరిగణించాలని ఎమ్మార్పీఎస్ నేతలు నరేంద్రబాబు, గోపి మాదిగ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుపతి జిల్లాలో నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాల్లో దాదాపు 70శాతం మాదిగలను ఎస్సీ ఆది ఆంధ్ర ఉపకులంగా చూపుతున్నారని, తక్షణం సరిదిద్ది ఎస్సీ మాదిగలుగా నమోదు చేయాలని కోరారు.

సోలార్ టాప్‌తో విద్యుత్ ఆదా చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖరరావు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యాఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ చిన్నకోటి చంద్రశేఖరరావు విజ్ఞప్తి చేశారు. పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ ఈఈ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కాంట్రాక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. గృహాలపై సోలార్ టాప్‌లను అమర్చుకుని విద్యుత్ పొదుపు చేసుకోవాలని కోరారు. రాయితీ పథకాలను వినియోగించుకుంటేమరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, జయప్రకాష్, మునిప్రసాద్, రమేష్‌లు, ఏఈలు, సోలార్ రూఫ్‌టాప్ కంపెనీల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు పెరిగాయి

సాధారణ దొంగతనాలు తగ్గాయి
● వివాహేతర సంబంధాలు, కుటుంబ తగాదాతోనే పలు హత్యలు
● ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడి



అధికారులతో కలిసి మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం),డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):'జిల్లాలో ఈ ఏడాది సైబర్ నేరాలు పెరిగాయి.కానీ, పోలీసు శాఖ తీసుకున్న ముందస్తు చర్యలతో సాధారణ నేరాలు తగ్గాయి' అని ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్శిటీ సావేరి అతిథి గృహంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో వార్షిక నేర గణాంకాలను ఎస్పీ వెల్లడించారు. 2023లో సైబర్ నేరగాళ్లు రూ.2.45 కోట్లు దోచుకోగా.. రూ.84.08 లక్షలు రికవరీ చేశామన్నారు. ఈ ఏడాది రూ.12.89 కోట్లకుగాను రూ.2.36 కోట్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. మొబైల్ హంట్ ద్వారా ఇప్పటి వరకు రూ.7.56 కోట్ల విలువచేసే దాదాపు 4275 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. జిల్లాపోలీసులు టెక్నాలజీని వినియోగించి ఐదు సంచలనాత్మక కేసులను ఛేదించినట్లు తెలిపారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే దాదాపు 100 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన 882 ఫిర్యాదుల్లో 762 పరిష్కరించినట్లు తెలిపారు. పారదర్శకత, పౌర స్నేహక పోలీసింగ్‌ను మెరుగుపరచడానికి 'పోలీసు వెబ్‌సైట్ ప్రారంభించామన్నారు. దొంగతనాలు, నేరాలు, రోడ్డు ప్రమాదాలు, వైట్ కాలర్ నేరాలు, ఇతర నేరాల గురించి గణాంకాల సహా వివరించారు. ఇక, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ద్వారా ఆరు నెలల్లో దాదాపు 100 కేసులు నమోదు చేసి 2061 దుంగలు.. 108 వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు. ముగ్గురిపై పీడీ యాక్టు పెట్టామన్నారు. కోర్టు మానటరింగ్ వ్యవస్థ ద్వారా అన్ని శాఖలను సమన్వయం చేసుకోవడంతో పోక్సో, హత్యలకు సంబంధించి 13 కేసుల్లో కొందరికి జీవిత ఖైదు, మరికొందరికి ఐదారేళ్ల జైలు శిక్షలు పడ్డాయన్నారు. వివాహేతర సంబంధం, కుటుంబ తగాదాలు, బంధువుల మధ్య గలాటాల కారణంగా చాలావరకు హత్యలు జరిగాయని అభిప్రాయపడ్డారు.

గంజాయిపై ఉక్కుపాదం

ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేసి ఆరు నెలల్లో గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. 85 కేసులు నమోదు చేసి 872.307 కిలోలు, 17 వాహనాలను స్వాధీనం చేసుకుని 223 మందిని అరెస్టు చేశామన్నారు. 239 మందిపై గంజాయి షీట్స్ ఓపెన్ చేశామన్నారు. విద్యా సంస్థల్లో 241 డ్రగ్స్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.

వీవీఐపీల భద్రతకు పెద్దపీట

'ఏడాది కాలంలో దాదాపు 1069 మంది వీవీఐపీలు జిల్లాకు వచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం లేకుండా వీరికి భద్రత కల్పించాం. తిరుమల బ్రహ్మోత్సవాలు, శ్రీకాళహస్తి మహాశివరాత్రి ఉత్సవాల్లోనూ భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశాం. తిరుచానూరు ఉత్సవాలు బ్రహ్మాండంగా జరిగాయని సీఎం చంద్రబాబు అభినందించారు' అని ఎస్పీ పేర్కొన్నారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం అభినందనీయం



పనిముట్లను పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

రేణిగుంట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం అభినందనీయమని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వరిలో డ్రమ్ సీడర్, భూసార పరీక్షా ఆధారిత ఎరువుల యాజమాన్యం, డ్రోన్‌ల వినియోగం, సమగ్ర వ్యవసాయ విధానాలను రైతులకు చేరువ చేయడంలో కేవీకే కృషి అద్భుతమన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఐసీఏఆర్ అటారీ డైరెక్టర్ ఎస్ షేక్‌మీరా, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రసంగించారు. రైతులకు ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం విత్తనాలు, పనిముట్లను పంపిణీ చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత సాంస్కృతిక విజేతగా ఎస్వీయూ

11 అంశాల్లో వర్సిటీకి బహుమతుల పంట



మెడల్స్‌తో ఎస్వీయూ విద్యార్థులు, అధికారులు - ట్రోఫీ అందుకుంటున్న ఎస్వీయూ విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత సాంస్కృతిక విజేతగా ఎస్వీ యూనివర్సిటీ నిలిచింది. చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన దక్షిణ భారత సాంస్కృతికోత్సవంలో ఎస్వీ యూనివర్సిటీకి చెందిన కళా బృందాలు, విద్యార్థులు పోటీల్లో పాల్గొని ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. క్లే మోడలింగ్‌లో మొదటి స్థానం, పోస్టర్ మేకింగ్‌లో మొదటి స్థానం, ఇన్‌స్టాలేషన్‌లో ద్వితీయ స్థానం, రంగోళిలో ద్వితీయ స్థానం, మెహందీలో ద్వితీయ స్థానం, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో నాల్గవ స్థానం, ర్యాలీలో నాల్గవ స్థానం, డ్యాన్స్‌లో ఐదవ స్థానం, లైట్ ఓకల్‌లో ఐదవ స్థానం, కొలేజ్‌లో ఐదవ స్థానం, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్స్‌లో ఐదవ స్థానంలో నిలిచి ఎస్వీయూ విద్యార్థులు బహుమతుల పంట పండించారు. వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు వారిని అభినందించారు. ప్రభుత్వ సహకారంతో వచ్చే ఏడాది యూనివర్సిటీ వేదికగా దక్షిణ భారత సాంస్కృతికోత్సవం నిర్వహిస్తామని అన్నారు.

శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాల ప్రారంభం



తిరుమల, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులోభాగంగా రాత్రి 7.30 నుంచి 8.30 గంటలవరకు రంగనాయక మండపంలో కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజుల ముందు నుంచి 25 రోజుల పాటు వీటిని నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో జీయర్‌స్వాములు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ పడవ పోటీలకు ఆంధ్రా క్రీడాకారులు



ఢిల్లీకి బయలుదేరిన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జనవరి 3-6మధ్యలో జరిగే నేషనల్ డ్రాగన్‌బోట్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 31 మంది క్రీడాకారులు పయనమయ్యారు. శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, విజయవాడ, నెల్లూరు, కర్నూలు, తిరుపతి జిల్లాల నుంచి డ్రాగన్ బోట్ క్రీడాకారులు వారం రోజులుగా రాయలచెరువులో శిక్షణ తీసుకున్న విషయం తెలిసిందే. సోమవారం రాత్రి శ్రీనివాస క్రీడా సముదాయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవినాయుడు క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. జాతీయస్థాయి పోటీలలో రాణించి అధిక పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, ప్రదీప్‌నాయుడు, డీఎస్‌ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీటీడీ చైర్మన్

తిరుమల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడిని టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం అమరావతిలో కలిశారు. తిరుమలలో భక్తులు గంటల తరబడి క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో వేచిఉండే అవసరం లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా త్వరితగతిన దర్శనం కల్పించే ప్రయత్నాలు చేస్తున్నట్టు సీఎంకు ఆయన వివరించినట్లు తెలిసింది. ఏఐ ఏర్పాటుకు ముగ్గురు నిపుణులతో కూడిన కమిటీని వేయలని సీఎంను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అలాగే స్విమ్స్ ఆస్పత్రి నిర్వహణకు టీటీడీ నుంచి ప్రతి ఏడాది రూ.వంద కోట్లు నష్టం వాటిల్లుతోందని, ఆరోగ్యశ్రీ నుంచి రూ.80 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. అలాగే చిన్నపిల్లల ఆస్పత్రి, స్విమ్స్‌లో నూతన భవనాల నిర్మాణాలు, వాటి ఖర్చుపై సీఎంకు వివరించగా వెంటనే వాటిని నిలిపివేసేలా బోర్డులో నిర్ణయం తీసుకున్నట్టు సీఎంకు చైర్మన్ వివరించినట్లు తెలిసింది. ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ, టీటీడీలో అన్యమత ఉద్యోగుల బదిలీ, వీఆర్‌ఎస్ తదితర అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం.

పుత్తూరు వార్తలు

ఆంగ్లసంవత్సరాది సంబరాల్లో నిబంధనలు అతిక్రమించొద్దు


డీఎస్పీ రవికుమార్

పుత్తూరు అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు విషాద సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని పుత్తూరు డీఎస్పీ రవి కుమార్ పేర్కొన్నారు. వాగులు, వంకలు, కొండలు, కోనలు, బావులు వద్దకు వెళ్లి మద్యం తాగి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. ద్విచక్రవాహనాలపై అతివేగంగా ప్రయాణించడం, శబ్ద కాలుష్యం కలిగించడం, వేడుకల పేరిట నడిరోడ్డులో కేక్‌లు కట్ చేయడం వంటివి నిషేధమన్నారు. ఇక డివిజన్ పరిధిలో హోటళ్ల, ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాల్లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు అనుమతులు ఇవ్వలేదన్నారు. అలాగే రాత్రంతా గస్తీ ఉంటుందన్నారు.

కీలగరంలో సారా స్వాధీనం
ఇద్దరి అరెస్టు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలం కీలగరంలో సారా విక్రయిస్తున్నన్న ఇద్దరిని పుత్తూరు ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మురళీకృష్ణ తెలిపిన వివరాలు... సారా విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో నిందితులను పట్టుకున్నారు. కీలగరంకు చెందిన తిరుపతి వినోద్‌కుమార్, తిరువట్యంకు చెందిన కిషోర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. నవోదయం-2 లో భాగంగా సారా నియంత్రణకు పూర్తి స్థాయి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

పుత్తూరు టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణం రాజీనామ చేయాలని సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు వెంకటేష్, సీపీఐ నాయకుడు మహేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందన్నారు. కృష్ణారెడ్డి, విజయ్, యాసిన్, సుబ్రమణ్యం పిళ్లై, సతీష్, గోవిందస్వామి, హరిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు

పుత్తూరు టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయం, ఆరేటమ్మ ఆలయాల హుండీ లెక్కించినట్టు ఆలయ ఈవో జయకృష్ణ తెలిపారు. సదాశివేశ్వర ఆలయంలో 6 నెలలు గాను రూ.2,86,041, అలాగే ఆరేటమ్మ ఆలయంలో 8 నెలలకు రూ. 1,20,161 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బ్యాంకులో జమచేస్తున్నట్లు తెలిపారు. లెక్కింపులో గ్రామ పెద్దలు జీవరత్నంనాయుడు, విక్కీరాయల్, బాబు, ఆలయాధికారి సుమనప్రియ, పోలీసులు పాల్గొన్నారు.

అప్పలాయగుంటలో నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

వడమాలపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆల్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ శ్రీవాణి చెప్పారు. జనవరి నెల 10న వైకుంఠ ఏకాదశి 11న ద్వాదశిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 8.30-11.00 గంటల మధ్య కోయిల్ ఆల్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

డంపింగ్‌యార్డ్‌కు స్థలం కేటాయింపు

వడమాలపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వివాదాస్పదంగా ఉన్న పోరంబోకు స్థలాన్ని హైకోర్టు తీర్పు మేరకు సర్వే చేసి గ్రామస్తులకు అప్పగించారు. తహసీల్దార్ జరీనా ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి రెండు ఏకరాలను డంపింగ్ యార్డులకు, 37 సెంట్లను శ్మశానికి కేటాయిస్తూ సర్వే రాళ్లు నాటారు. ఎస్ఐ ధర్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

వడమాలపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు నాణ్యంగా ఉండాలని రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖ కుమార్ చెప్పారు. సోమవారం మండలంలోని బట్టీకండ్రిగలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలను ఆయన సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి లోగా రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. పరిశీలనలో అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్, ఉపాధి ఏపీవో సుజాత తదతరులు పాల్గొన్నారు.

జాతీయ బీచ్ గ్రాప్లింగ్ పోటీలకు వడమాలపేట క్రీడాకారులు

వడమాలపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరిగిన బీచ్ గ్రాప్లింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల క్రీడాకారులు విశాల్, లోకనాథంలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జనవరిలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే పోటీల్లో ప్రాతినిధ్య వహిస్తారని పి.డి. చంద్రశేఖర్‌రాజు చెప్పారు. క్రీడాకారులను హెచ్ఎం కరుణ నవనీతం, ఉపాధ్యాయులు అభినందించారు.

పల్లం విద్యార్థి కూడా...

ఏర్పేడు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మునికుమార్ జాతీయ బీచ్ గ్రాప్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, వ్యాయామ ఉపాధ్యాయురాలు పుష్పవాణి తదితరులు మునికుమార్‌ను అభినందించారు.

వీధి విక్రయదారులకు న్యాయం చేయండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ సమీపంలోని వీధి విక్రయదారులకు న్యాయం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం వీధివిక్రయదారులతో కలిసి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ వీధిలో ఉన్న వీధి విక్రయదారుల దుకాణాలను తొలగించడం వలన వారు రోడ్డున పడ్డారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారికి కనీస సదుపాయాలు కల్పిస్తూ ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలని కోరారు.

తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీలో చేరుదాం


తొట్టంబేడులో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న అంకయ్య చౌదరి

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీలో చేరుదామని ఆ పార్టీ సాంస్కృతిక విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి అన్నారు. టీడీపీ సభ్యత్వ తీసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. పెద్దసంఖ్యలో టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిన్నల రవి, ఉమేష్‌రావు, పూల శేఖర్, శివకుమార్, లోకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నియోజకవర్గ పరిశీలకుడు అంకయ్య చౌదరి ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలం చిన్నకన్నలి, పెదకన్నలి గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు.

దుప్పట్ల పంపిణీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మరాజులస్వామి ఆలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల వసతిగృహంలో శ్రీసత్యసాయి అన్నదాన ప్రసాద, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. రమేష్, పాండురంగయ్య, ఆనందరావు, మిద్దెల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పశువుల కాపరి మృతదేహం లభ్యం


నాగూరయ్య (ఫైల్‌ఫొటో) - మృతదేహం

కోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి స్వర్ణముఖినది వద్ద ఆదివారం గల్లంతైన పశువుల కాపరి యల్లశిరి నాగూరయ్య (47) మృతదేహం సోమవారం లభ్యమైంది. మండలంలోని రుద్రవరం అరుంధతీయవాడకు చెందిన నాగూరయ్య నీళ్ల కోసం నదిలోకి వెళ్లిన పశువులను బయటకు తోలుతుండగా ఇసుక గోతిలో పడి గల్లంతైన సంగతి తెలిసిందే. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆదివారం పొద్దుపోయే వరకు స్వర్ణముఖినదిలో గాలించినా ఆచూకీ లభ్యంకాలేదు. సోమవారం ఉదయం గూడలి వంతెన వద్ద నాగూరయ్య మృతదేహం తేలియాడుతుండటంతో స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు, ఎస్ఐ పవన్‌కుమార్, తహసీల్దారు జయజయరావు సంఘటనాస్థలికి చేరుకొని నాగూరయ్య మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.


రుద్రవరం వద్ద స్వర్ణముఖిలో ఇసుక కోసం తవ్విన గోతులు - స్వర్ణముఖినదిలో ఇసుక గోతులపై పారుతున్న నీళ్లు

మృత్యు కుహరంలా స్వర్ణముఖి

- రుద్రవరం, గూడలివాసులను మింగేస్తున్న గోతులు
- మూడేళ్లలో ఐదుగురి మృత్యువాత
- వైసీపీ నేతల ఇసుక తవ్వకాల పాపం

కోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిధిలోని స్వర్ణముఖి నది మృత్యు కుహరంలా మారింది. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల ఇసుక అక్రమ తవ్వకాలతో స్వర్ణముఖి గోతలమయంగా తయారైంది. నిబంధనలను తూట్లు పొడిచి లక్షలాది టన్నుల ఇసుకను పక్క రాష్ట్రాలకు తరలించి కోట్లాది రూపాయలు గడించారు. నదిలో ఎక్కడ చూసినా గోతులే ఉండడడంతో పరివాహక గ్రామాల ప్రజల ప్రాణాలు తోడేస్తున్నాయి. ముఖ్యంగా రుద్రవరం, గూడలి గ్రామాల ప్రజలు స్వర్ణముఖి నదిలోకి వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. రుద్రవరం పంచాయతీలోని ప్రజలంతా స్థానికంగా ఉన్న స్వర్ణముఖినదిని దాటుకొని ఆవలి ఒడ్డుకు చేరుకుంటారు. అక్కడ నుంచి నాయుడుపేట, కోట వైపు వెళ్తుంటారు. ఇక్కడ పంచాయతీకి ఉన్నత పాఠశాల లేకపోవడంతో పిల్లలంతా ఒకటిన్నర కిలో మీటరు ఏరుదాటి ఆవలి ఒడ్డున ఉన్న చిట్టమూరు మండలం మెట్టు ఉన్నత పాఠశాలలో వెళ్తుంటారు. అయితే వైసీపీ నాయకుల ఇసుక అక్రమ తవ్వకాల పుణ్యమాని స్వర్ణముఖినదిలో భారీగా గోతులు ఏర్పడడంతో పశువుల కాపర్లు మొదలుకొని చిన్న పిల్లల వరకు ఆ గోతుల్లో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో ఇద్దరు పశువుల కాపర్లు పశువులను బయటకు తోలేందుకు వెళ్లి గోతుల్లో పడి ప్రాణాలు కోల్పోయారు. అదే విధంగా 10వ తరగతి విద్యార్థి ఏరు దాటుతూ ఇసుక గుంతలో పడి మృతి చెందాడు. అదే విధంగా ఈ ఏడాది మార్చిలో గూడలికి చెందిన మస్తానయ్య ఎడ్లబండి నడుపుకుంటూ నదిలో గోతులోపడి ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా ఆదివారం రుద్రవరం అరుంధతీయవాడకు చెందిన నాగూరయ్య నీళ్ల కోసం నదిలోకి వెళ్లిన పశువులను బయటకు తోలుతుండగా ఇసుక గోతిలో పడి గల్లంతైన సంగతి తెలిసిందే. సోమవారం గూడలి వద్ద అయన లభ్యమైంది. రైతులు, విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుంటే గ్రామాలైన రుద్రవరం, గూడలి గ్రామాల వాసులు స్వర్ణముఖినది అంటేనే హడలిపోతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం: టీడీపీ



సదస్సులో మాట్లాడుతున్న చంద్రారెడ్డి, వేదికపై తహసీల్దార్ శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్ సర్వేపల్లి రత్నయ్య

డక్కిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాల్లో కూటమి ప్రభుత్వం ముందుంటోందని టీడీపీ నాయకులు డక్కిలి చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కంథలవారిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి మేరకు సంక్షేమ పథకాలన్నింటినీ ఒక్కొటిగా అములు చేస్తోందన్నారు. కంథలవారిపల్లికు చెందిన గిరిజనలు గత కొన్నేళ్లుగా సాగు చేసుకొంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసుకొంటున్న భూములకు పట్టాలు ఇచ్చేవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకొంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజగోపాల్, విద్యాకమిటీ చైర్మన్ రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు మాసాల్లో వెంకటగిరి రూపురేఖలు మారుస్తా: కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) వచ్చే ఆరు మాసాల్లో వెంకటగిరి రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వచ్చే ఆరు మాసాల్లో మూడు ప్రధానమైన పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో మట్టిరోడ్లు కనిపించకుండా చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే డక్కిలి మండలంలోని తెలుగుగంగ కాలువ నుంచి డక్కిలి, తురకపల్లి, మోపూరు వద్ద కాలువకు తూములు ఏర్పాటు చేసి 5వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఇక వెంకటగిరి మున్సిపాలిటీలో నూతన పైపులైను నిర్మాణం చేపట్టి తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు.

విశ్వోదయ కళాశాల సమస్యలను పరిష్కరించండి



ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌వో నాయకులు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 30,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌వో) ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో నాయకుడు సీహెచ్ పవన్ మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ కళాశాలలు 1968లో ప్రైవేటు మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పడగా, 1977లోప్రభుత్వానికి అప్పగించారన్నారు. 2002లో జూనియర్ కళాశాలను విభజించి డిగ్రీ కాలేజీని తిరుపతి రోడ్డులోకి తరలించారని తెలిపారు. 2007లో విశ్వోదయ స్థలాలను కొందరు వేలం పాడుకున్నారన్నారు. ఆ స్థలాలు, భవనాలను జూనియర్ కళాశాలకు అప్పగిం చాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలకు గదుల కొరత ఉండడంతో కొన్ని తరగతులను పాత భవనంలో నిర్వహిస్తున్నారని చెప్పారు. అలాగే విద్యార్థులు టెక్నికల్ స్కిల్స్ పెంచుకోవడానికి కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఝాన్సీ, ఏఐవైఎఫ్ నాయకులు సాయికుమార్, పీడీఎస్‌వో నాయకులు హరిప్రసాద్, లీలా మోహన్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

వరిపైరు మేపేశారని ఫిర్యాదు

పెళ్లకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరిపైరును ఆవులతో మేఇంచేశారని పునబాక గ్రామానికి చెందిన మల్లెమాల మల్లిఖార్జునరెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను కౌలుకు సాగు చేస్తున్న 70సెంట్లు వరిపైరును అదే గ్రామానికి చెందిన బత్తెయ్య ఆవులతో మేపించాడని, ఇదేమిటని అడిగితే మరో కయ్యలో ఉన్న వరి పంటను కూడా మేపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుర్రంకొండలో రెవెన్యూ సదస్సు

ఓజిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం గుర్రంకొండ, కార్జిమేడు గ్రామాల్లో సోమవారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ ఆక్రమణలు, పట్టాదారు పాసు పుస్తకాల కోసం రైతులు అర్జీలు అందజేశారు.

భూ సమస్యలకు పరిష్కారం

నాయుడుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. నాయుడుపేట మండలం పూడేరులో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో భూ తగాదాలు, సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ అధికారి హరోంహరరావు, ఆర్ఐ సాయితేజ, వీఆర్వో రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహిస్తాం

కోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులను మరింతగా ప్రోత్సహిస్తామని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ అన్నారు. కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర జూనియర్ కళాశాల, పాఠశాలల నుంచి సౌత్‌జోన్ క్రీడా పోటీలకు వెళ్లే విద్యార్థులకు సోమవారం జలీల్ అహ్మద్ రూ.15వేల విలువచేసే క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి నెల్లూరు మోహన్‌రెడ్డి, పీఈటీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధి పనులు ప్రయోజనకరంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కరరెడ్డి

బాలాయపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద అడవులు, చెరువుల్లో గుంతలు తవ్వడం వల్ల నిధులు వృథా అవడం తప్ప ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. అంతకుముందు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాన పార్వతి, ఎంపీడీవో వినీల్ కుమార్, డీటీ శిరీషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి


మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో డీజేల వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో కేక్ కట్ చేయడం, పార్టీలు నిర్వహించడం నిషేధించామన్నారు. అలాగే బైక్‌లలో ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే రూ.10వేల జరిమానా, జైలు శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట అర్బన్ సీఐ బాబి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే నూతన సంవత్సర వేడుకలు

చిట్టమూరు, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వేడుకలు నిబంధనల ప్రకారమే జరుపుకోవాలని ఎస్ఐ చిన్న బలరామయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నేటి రాత్రి పోలీసు ఆంక్షలు అమల్లో ఉంటాయని, ఎవరైన నిబంధనలకు వ్యతిరేకంగా వేడుకలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. రాత్రి బైక్‌లపై చక్కర్లు కొడుతూ ప్రజలకు విఘాతం కలిగించిన, బహిరంగ ప్రదేశాల్లో కేక్ కట్ చేస్తూ కేకలు వేయడం, వికృత చేష్టలకు పాల్పడే వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. డీజేలు, అసభ్యకరమైన నృత్యాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

తడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి 11 గంటల తరువాత వాణిజ్య దుకాణాలు మూసివేయాలని, బహిరంగ ప్రదేశాలలో కేక్ కట్ చేసినా, మద్యం సేవించినా, గుంపులుగా తిరిగినా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఎస్ఐ సూచించారు.

నుడా చైర్మన్‌కు సన్మానం

నాయుడుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని సోమవారం నెల్లూరులో టీడీపీ నాయకుడు గూడూరు సుధీర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, చెన్నారెడ్డి సుబ్బారెడ్డి శాలువతో సత్కరించారు.


శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న సుధీర్‌రెడ్డి, సుధీర్, సుబ్బారెడ్డి

ఉరేసుకుని శ్రీసిటీ కార్మికుడి మృతి

సూళ్లూరుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటి పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు సిరాపురం దినేష్ (26) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన సోమవారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు... తిరుపతికి చెందిన దినేష్ శ్రీసిటీలో పనిచేస్తున్నాడు. ముగ్గరి స్నేహితులతో కలిసి సూళ్లూరుపేట స్వతంత్రపురంలో గది అద్దెకు తీసుకొని ఉంటున్నారు. సోమవారం జనరల్ షిఫ్ట్ కావడంతో దినేష్ డ్యూటీకి వెళ్లలేదు. రాత్రి స్నేహితులు గదికి వచ్చేటప్పటికి ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడినీళ్లు పడి గాయపడిన చిన్నారి మృతి


వర్షిత(ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జక్కనవానిపల్లి గొల్లపాళెంలో వేడినీళ్ళు పడి గాయపడిన చిన్నారి సోమవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... పెట్లాల శ్రీనివాసులు, రేవతి దంపతుల కుమార్తె వర్షిత(3) ఈనెల 25న ఇంట్లో ఆడుకుంటుండగా వేడినీళ్లు పడడంతో శరీరం బాగా కాలిపోయింది. చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు: కురుగొండ్ల


కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు వెంకటగిరి డిపో నుంచి కొత్తగా 11 బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. సోమవారం డిపోకు కొత్తగా వచ్చిన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బస్సులు రాకతో ఇకపై అన్ని మార్గాల్లో సర్వీసులను నడుపుతామన్నారు. వెంకటగిరి నుంచి తిరుపతి, గూడూరు, నెల్లూరు మార్గాల్లో ప్రతి అర్థ గంటకూ ఒక బస్సు నడుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు, పులికొల్లు రాజేశ్వరరావు, గంగాధరం, అవ్వారు సత్యం, పునుగోటి విశ్వనాధనాయుడు, మల్లారం బాబు, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తడ బీజేపీ అధ్యక్షుడిగా తేజారెడ్డి


తేజారెడ్డిని సన్మానిస్తున్న సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, ఆది నారాయణరెడ్డి

తడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తడ మండల బీజేపీ అధ్యక్షుడుగా తేజారెడ్డి నియమితులయ్యారు. సోమవారం అక్కంపేటలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడిగా చిల్లకూరు తేజారెడ్డిని ప్రస్తుత అధ్యక్షుడు రాచర్ల కృష్ణమూర్తి ప్రతిపాదించగా జిల్లా నాయకులు ఆమోదించారు. అనంతరం తేజారెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, నాయకులు గోపీ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్ గౌడ్



సూళ్లూరుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా అత్తిరాల కిరణ్‌కుమార్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక రోటరీ హాలులో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ తాడిపర్తి ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కిరణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, శ్రీనివాసులు, కోటయ్యగౌడ్, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

గూడూరు అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపిరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు సోమవారం ఉత్సాహంగా సాగాయి. మొదటి మ్యాచ్ ప్రాస్‌పరో - రత్నం జట్ల మధ్య జరిగింది. ప్రాస్‌పరో జట్టు 51 పరుగులతో విజయం సాధించింది. రెండో మ్యాచ్ నారాయణ - సాయివిద్యానికేతన్ జట్ల మధ్య జరగ్గా నారాయణ జట్టు 45 పరుగుల విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్ వీఎస్ఆర్ - ఆదిశంకర జట్ల మధ్య జరగ్గా ఆదిశంకర జట్టు 12 పరుగులతో, నాలుగో మ్యాచ్ ఎల్‌పీపీ - జీఎస్ఆర్ఎం జట్ల మధ్య మధ్య జరగ్గా ఎల్‌పీపీ 79 పరుగుల తేడాతో విజయం సాధించాయి.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

చిల్లకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటక్రాస్ రోడ్డు సమీపంలోని నక్కలవారికండ్రి గిరిజన కాలనీకి చెందిన లక్ష్మమ్మకు వైద్యఖర్చుల కోసం సోమవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15వేలు ట్రస్ట్ సభ్యులు బాబు, భాస్కర్ చేతుల మీదుగా అందజేశారు. లక్ష్మమ్మ గత కొద్ది రోజులుగా క్యాన్సర్‌తో బాధపడుతోంది.

రోడ్లపై నూతన సంవత్సర వేడుకలు నిషేధం

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రోడ్లపై నూతన సంవత్సర వేడుకలు నిషేధించామని, ఆంక్షలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. పట్టణవ్యాప్తంగా మంగళవారం రాత్రి 8 గంటల నుంచి ఆంక్షలు అమలు చేస్తామన్నారు. 10 గంటలకంతా హోటళ్లు, రెస్టారెంట్లు మూత వేయాలన్నారు. 10గంటల తరువాత మెడికల్ షాపులకు మాత్రమే అనుమతిస్తామన్నారు. ఇక ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించినా, మద్యం తాగి నడిపినా చర్యలు తప్పవన్నారు. పట్టణవ్యాప్తంగా రాత్రి 8గంటల నుంచి ప్రత్యేక పోలీసు బృందాలు బందోబస్తు నిర్వహిస్తాయన్నారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తామన్నారు. రామసేతు వంతెన, భక్తకన్నప్ప వంతెనలపై నూతన సంవత్సర వేడుకలకు అనుమతి లేదన్నారు. అర్ధరాత్రి బాణసంచా కాల్చడంపై నిషేధం విధించామన్నారు.

అత్యుత్సాహం వద్దు

వరదయ్యపాళెం: నూతన సంవత్సర వేడుకల్లో అత్యుత్సాహం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. 31వ తేదీ రాత్రి ఆరుబయట వేడుకలను అనుమతులు లేవని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ఐదుగురుకన్నా ఎక్కువ గుమికూడటం నిషేధమన్నారు. ఇక డీజేలు వినియోగించరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రత్యేక నిఘా

బుచ్చినాయుడుకండ్రిగ : నూతన సంవత్సర వేడుకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు. రోడ్లపై కేక్‌లు కట్ చేయడం, అశ్లీల నృత్యాలు, డీజే సౌండ్, రికార్డింగ్ డాన్సులు నిర్వహించేందుకు అనుమతులు లేవన్నారు.

శృతి మించితే చర్యలు

రేణిగుంట: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా వేడుకల నిర్వహణలో శృతిమించితే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. అనుమతులు లేకుండా నిర్వహించే కార్యక్రమాలపై చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి బైక్ రేసింగ్‌లకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

సత్యవేడు: నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే చర్యలు తప్పవని సత్యవేడు సీఐ మురళి హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల్లోని ప్రజలు, యువత నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



శ్రీకాళహస్తిలో కమ్యూనిస్టు నాయకుల నిరసన

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీపీఎం, సీపీఐ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు పుల్లయ్య మాట్లాడుతూ... అమిత్‌షా అలా అంబేడ్కర్‌ను అవమానిస్తూ మాట్లాడు తున్నా రిజర్వేషన్లపై గెలిచిన 160మంది పైగా ఎంపీలు నోరు మెదపకపోవడం సరికాదన్నారు. జనమాల గురవయ్య, ఫల్గుణ, మించల శివకుమార్, గోపి, మునిచందు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్ధన్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ ఆధ్వర్యంలో సత్యవేడులో నిరసన జరిగింది.

సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్‌ని కోరారు. సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలోని కల్వర్టులు, కాజ్‌వేలు, రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌ని ఎమ్మెల్యే కలసి సమస్యలను వివరించారు. చివరిగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు ఎమ్మెల్యే శాలువ కప్పి నూతన సంవత్సరం శుభాకాంక్షలను తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు





ఆలయం వద్ద కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ , పారిశ్రామికవేత్త శాంతి ప్రియదర్శిని తదితరులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త శాంతి ప్రియదర్శిని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్ర మంలో బొజ్జల బృందమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన రావు తెలిపారు. మండలంలోని దొంగలమడూరులో సోమవారం ఉదయం రెవెన్యూ సదస్సు జరిగింది. పలువురు రైతులు, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు. అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరిస్తామన్నారు. ఇక మధ్యాహ్నం శ్రీకృష్ణాపురంలో రెవన్యూ సదసస్సు నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలంలో ఉదయం చల్లపాళెం, మధ్యాహ్నం రాచగున్నేరిలో రెవన్యూ సదస్సులు జరిగాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని సదాశివపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 68 అర్జీలు వచ్చాయని తహసీల్దారు మునిరత్నం రెడ్డి చెప్పారు. సమస్యలను 40రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో సోమవారం తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భూమి హక్కులు కల్పించాలని కోరుతూ నాలుగు దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై విచారణ జరిపించండి

సత్యవేడు: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ గ్రామంలో జరిగిన గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సదస్సులో కన్నవరం గ్రామస్తులు తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం అందించారు. 2021-24 మధ్య డీకేటీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు జరిగాయన్నారు. తవ్వకాల కారణంగా ఏర్పడిన గుంతల్లో నీరు నిండి గ్రామానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. అత్యవసర సమయాల్లో గ్రామానికి 108 వాహనం వచ్చేందుకు వీలులేకుండా పోయిందన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య దశాబ్ద కాలంగా నలుగుతున్న భూ వివాదాన్ని పరిష్కరించాలని పలువురు దళిత రైతులు వినతిపత్రం అందించారు. జడేరి సర్పంచు బుజ్జమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణఃకుమార్ రెడ్డి, పరమశివం, ఆర్ఐ సురేష్, వీఆర్వో శేఖర్ పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి హుండీ ఆదాయం రూ.4.65లక్షలు

ఏర్పేడు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4,65,000 వచ్చింది. ఆలయం వద్ద సోమవారం లెక్కింపు చేపట్టారు. మొత్తం 60 రోజుల వరకు వచ్చిన హుండీ ఆదాయం ఇది.

భక్తులకు ప్రసాదాల పంపిణీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ముక్కంటి భక్తులకు శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు ప్రసాదాలను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా భగవద్గీతను పంపిణీ చేసినట్లు తెలిపారు. జ్ఞానాంబవారి మధు, లక్ష్మీపతిరెడ్డి, అత్తింజేరి బాలాజీ, చింతకాయల సుధాకర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య ఉత్సవం వైభవంగా జరిగింది ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి పురవిహారం చేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

● శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బెమ్మకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్ఠింపజేసి వీధుల్లో ఊరేగించారు.

పాఠశాలలో వసతుల పరిశీలన



భోజనం వడ్డిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వసతులను ఎమ్మెల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మ సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా భోజన నాణ్యతపై ఆరా తీశారు. పాఠశాల గదులను, శుద్ధనీటి జల ప్లాంట్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు.

నాగలాపురం స్టేషన్ తనిఖీ

నాగలాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నాగలాపురం పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ రవి కుమార్ తనిఖీ చేశారు. గంజాయి రవాణాపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సునీల్‌ను ఆదేశించారు. రిసెప్షన్ సెంటర్, రైటర్, లాకప్ గదులు, కేసు డైరీలు, ఇతర రిజిస్టర్లను తనిఖీ చేశారు. సత్యవేడు సీఐ మురళీనాయుడు, ఏఎస్ఐ రవి పాల్గొన్నారు.

కాట్రపల్లిలో ఘర్షణ

కేవీబీపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లిలో సోమవారం సాయంత్రం పాత కక్షల నేపథ్యంలో గొడవలు జరిగాయి. గ్రామానికి చెందిన నారాయణ, చంద్రయ్య అన్నదమ్ములు. అదే గ్రామానికి చెందిన పట్నం మోహన్, పట్నం నీలానందంతో పాత గొడవలున్నాయి. సోమవారం సాయంత్రం కాట్రపల్లి ఎస్టీకాలనీ వద్ద సోదరులు ఉండగా మోహన్, నీలానందం అక్కడికి వెళ్లి టీడీపీ ప్రభుత్వం కదా, ఏం పీకుతున్నారని దురుసుగా మాట్లాడటంతో పాటూ కర్రలతో దాడిచేశారు. అయితే దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. గాయపడిన చంద్రయ్య, నారాయణ శ్రీకాళహస్తి ఆస్పత్రిలో చేరినట్లు తెలిసింది.

నత్రజని ఎరువులను తగు మోతాదులో వాడాలి

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రైతులు నత్రజని ఎరువులను తగు మోతాదులో వాడాలని ఏడీఏ రమేష్‌రెడ్డి అన్నారు. తొండమనాడులో పొలాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... వరి పంటకు ఆశించిన ఉల్లికోడు నివారణ కోసం ఎకరానికి ఫ్యూరిడాన్ 3 గుళికలు ఎనిమిది నుంచి పది కిలోలు వాడుకోవాలన్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు





ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయుడు, చక్రేశ్వరస్వామి

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ముందుగా వినాయకుడికి పూజలు చేశారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడి వీధిలో కొలువై ఉన్న చక్రే శ్వరస్వామికి సోమవారం పలు రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బెల్టుషాపులు, గంజాయిపై ఉక్కుపాదం



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

కేవీబీపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో బెల్టు దుకాణాలు నిర్వహించినా, గంజాయి విక్రయించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రవికుమార్ హెచ్చరించారు. సోమవారం కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఆరా తీశారు. నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిద్దికండ్రిగ, కేవీబీపురం, ఆదవరం గ్రామాల మార్గాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు సూచికబోర్డులను ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. ఇకపై గ్రామాల్లో వ్యాపారులు, ప్రజలు వారి ఇళ్లతో పాటు దుకాణాలకు కూడా సేఫ్టీ సైరన్ లాక్‌లను వాడాలని సూచించారు. సీఐ రవీంద్ర, ఎస్ఐ ఓబయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వం



కేవీబీపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గాజులకండ్రిగ, సదాశివపురం, రాయపేడు గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సభ్యత్వ నమోదుకు ఆఖరిరోజు కావడంతో ముమ్మరంగా పూర్తి చేసినట్లు నాయకులు చెప్పారు. మండలంలో 5,600 సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు బాలాజీ, సత్యవేడు తెలుగు యువత నాయకుడు లక్ష్మీపతి, వెంకటేష్, పురుషోత్తం, సురేష్‌రెడ్డి, తేజ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన సమస్యను పరిష్కరిస్తాం

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం శివనాథపాళెం పంచాయతీ కృష్ణాపురంలో శ్మశాన సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దారు మధుసూదన్ రావు అన్నారు. ఈ మేరకు కృష్ణాపురంలో ఆయన అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. కృష్ణాపురంవాసులు గతంలో ప్రభుత్వం తమ గ్రామంలో శ్మశానం కోసం కేటాయించిన భూమి ఆక్రమణకు గురైందని ఇటీవల వినతిపత్రం సమర్పించారు. త్వరలో సర్వే చేసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గాలి సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి ఘనస్వాగతం



రేణిగుంట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఘనస్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు వన్నియకుల క్షత్రియ వేల్ఫేర్ డైరెక్టర్ జీపాళెం తేజోవతి, కిసాన్ మోర్చా నాయకులు లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరి వెళ్లారు.